# సత్యవాక్యము

# THE WORD OF TRUTH

క్రైస్తవ మాసపత్రిక

MAY 1996

# సంక్షిప్త వార్తలు

1996 ఏప్రిల్ 2వ తేది నుండి 12 వ తేదీ వరకు సోదరులు జాషువా గూటం గారు ఢిల్లీలో యుండి సత్యవాణి రేడియో ప్రసంగములను రికార్డు చేసిరి. అమెరికా నుండి వచ్చిన సోదరులు జె.సి. ఛోట్ గారు ఈ విషయంలో గొప్పగా శ్రమించి సహకరించిరి. జాషువా గారితో వారి రెండవ కుమారుడు సామ్యూల్ రోసి కూడా ఢిల్లి వెళ్లిరి. న్యూఢిల్లీలోని క్రీస్తు సంఘము దిన దినాభివృద్ధి నొందు చున్నది.

ఏప్రిల్ 10 వ తెది నుండి 13 వ తేది వరకు విజయవాడ దుర్గాపురంలోని క్రీస్తు సంఘము గౌతమ్ పబ్లిక్ స్కూలు ఆవరణలో సువార్త కూటములు బైబిలు తరగతులు నిర్వహించిరి. ఈ కూటములలో పాల్ గూటం, జి. మార్కు గార్లు వాక్య పరిచర్య గావించగా ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మం పొందిరి. దుర్గాపురంలో సోదరులు కె. రాజ్ కుమార్ గారు క్రీస్తు కొరకు మంచి పని చేయుచున్నారు.

ఏప్రిల్ 15 వ తేదీ నుండి 23 వరకు న్యూఢిల్లీ నుంచి వచ్చిన సోదరులు ఫ్రాన్సిస్ డేవిడ్ గారు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లో ప్రత్యేక తరగతులలో వాక్యోపదేశముగావించిరి. 14 వ తేదీ ఆదివారం స్థానిక క్రీస్తు సంఘారాధనలో వాక్య పరిచర్య చేసిరి.

1996 ఏప్రిల్ నెల సువార్తికుల సదస్సు (Preachers Workshop) 25 వ తేదీ గురువారం నాడు సీతానగరం మండలం ఉండేశ్వర పురంలో జరిగెను. ఆంధ్ర రాష్ట్రంలోని పలు ప్రాంతముల నుండి సువార్తికులు తరలి వచ్చిరి. "దేవుడు నేడు మనతో ఎట్లు మాట్లాడు చున్నాడు ? " అనే అంశమును దేవుని వాక్యపు వెలుగులో వారు చర్చించిరి. ఎన్. మోజెస్, పాకా హెన్రీ, కె. శాంతారావ్, కె. ప్రసాద్, ఎన్.జె. మోహన్ రావ్, జి. షడ్రక్, ఇ.కె.వి. ప్రసాదరావ్. పాల్ గూటం, పి. సామ్యేలు, జషువా గూటం గార్లు చక్కని వర్తమానములనిచ్చిరి. బ్రదర్ ఆర్. సామ్యూల్ గారి ప్రార్థనతో సాయంకాలమున సదస్సు ముగిసెను. సోదరులు జి. జెకర్యా గారు ఉండేశ్వరపురంలోను, పరిసర ప్రాంతములలోను గొప్ప సేవ

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box 80, Kakinada, A.P. 533 001
Phone : 0884-63722

Editor :
**J.C. CHOATE**

Managing Editor :
**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 16 మే 1996 సంచిక 10


## సంపాదకీయం

### మనస్సాక్షి అనగానేమి ?

**(What is the Conscience?)**

మనస్సాక్షిని గూర్చి లేఖనాల్లో పలుమారులు చెప్పబడింది. వ్యభిచారమందు పట్టుబడిని స్త్రీని శాస్త్రులు పరిసయ్యులు ఒకసారి యేసునొద్దకు తీసికొని వచ్చిరి. మోషే ధర్మశాస్త్ర ప్రకారము ఆమెను రాళ్ళు రువ్వి చంపాలి. యేసు ఆమెను విడిచిపెడతారని తత్ఫలితముగా మోషే ధర్మశాస్త్రమును ఆయన గైకొనుట లేదని నిందించాలని వారు తలంచారు. "అయితే యేసు వంగి నేలమీద వ్రేలితో ఏమో వ్రాయుచుండెను. వారాయనను పట్టు వదలక అడుగుచుండగా ఆయన తలయెత్తి చూచి - మీలో పాపము లేనివాడు మొట్టమొదట ఆమె మీద రాయి వేయవచ్చునని వారితో చెప్పెను". "వారా

మాట విని పెద్దవారు మొదలుకొని చిన్నవారి వరకు ఒకని వెంట ఒకడు బయలు వెళ్ళిరి. యేసు ఒక్కడే మిగిలెను. ఆ స్త్రీ మధ్యను నిలువబడియుండెను. యేసు తలయెత్తి చూచి - అమ్మా, వారెక్కడ ఉన్నారు? ఎవరును నీకు శిక్ష విధింపలేదా? అని అడిగినప్పుడు ఆమె లేదు ప్రభువా అనెను. అందుకు యేసు - నేనును నీకు శిక్ష విధింపను, నీవు వెళ్లి ఇక పాపము చేయకుమని ఆమెతో చెప్పెను" (యోహాను 8 : 3 - 11).

క్రైస్తవ్య విరోధులు పౌలును యెరూషలేములో పట్టుకొని రోమా సైనికులు లేకపోతే అతనిని చంపియుందురు. జన సమూహము యెదుటను, రోమా శతాధిపతి యెదుటను, ప్రధాన యాజకులు పెద్దల యెదుటను నిలబడి "పౌలు మహాసభవారిని తేరి చూచి సహోదరులారా, నేను నేటి వరకును కేవలము మంచి మనస్సాక్షి గలవాడనై నడచుకొంటినని చెప్పెను" (అపొ.కా. 23 : 1). యిదివరలో పౌలు ప్రభువు ప్రజలను హింసించిన వాడేగాని ఇప్పుడు అతడు తన స్వకీయుల చేతనే హింసింపబడుచున్నాడు. అయితే అతడు ఎప్పుడు యేమి చేసినా మంచి మనస్సాక్షితోనే చేసానని అతడు ప్రకటించుచున్నాడు.

రోమా 9 : 1, 2 లో అతడు "క్రీస్తునందు నిజమే చెప్పుచున్నాను, అబద్ధమాడుట లేదు. పరిశుద్ధాత్మయందు నా మనస్సాక్షి నాతో కూడ సాక్ష్యమిచ్చుచున్నది" యని చెప్పాడు. మన ప్రభుత్వమునకు లోబడియుండుటను గూర్చి చెబుతు, "ఆగ్రహ భయమును బట్టిగాక మనస్సాక్షిని బట్టియు లోబడి యుండుట ఆవశ్యకము" అని అతడు చెప్పాడు (రోమా 13 : 5). I కొరింథీ 8 : 7 లో అతడు బలహీనమైన మనస్సాక్షిని గూర్చి చెబుతాడు. తరువాత వాత వేయబడిన మనస్సాక్షిని గూర్చి I తిమోతి 4 : 2లో అతడు చెబుతాడు. ఏలయనగా మంచి చెడుగుల నెరిగిన వాడు చెడుగునే ఎంచుకొంటే అతని మనస్సాక్షి వాత వేయబడినది, మృతమైనది యగును. తద్వారా వాని మనస్సాక్షియు

అపవిత్రపరచబడినదై యుండును (తీతు 1 : 15). అట్టివారు సత్యాన్ని అసత్యంతో మిళితం చేయువారు.

ఈ వాక్యభాగాలను బట్టి మనస్సాక్షిని గూర్చి లేఖనాల్లో చెప్పబడిందనీ, అది వివిధస్థితులలో యుండగలదనీ నీవు గ్రహించగలవు. అయితే మనస్సాక్షి అంటే యేమిటి? అది మనస్సనీ, హృదయమనీ, లేక అంతరాత్మయనీ నిఘంటువు నిర్వచింపవచ్చును. అది పసితనమునుండే ఎరిగిన జ్ఞానమును బట్టి మంచి చెడుగులను నిర్ధారించు తత్వము, తత్ఫలితముగా ఇది చేయవచ్చనీ, లేక చేయకూడదనీ మన ఆంతర్యమునకు సాక్ష్యమిచ్చునట్టిది.

కొందరు నీ మనస్సాక్షికి భిన్నముగా ప్రవర్తించనంతకాలము భక్తి పరుడవేయని చెబుతారు. అయితే యిట్టి ఆలోచన లోపభూయిష్టమైనది. మనం సంపాదించిన జ్ఞానమును బట్టి దేనినైనా మనస్సాక్ష అంగీకరించుటగాని, తిరస్కరించుట గాని చేయును. ఏదో ఒక అబద్ధమే సత్యమని ఒకనికి చిన్నప్పటి నుండీ బోధించిన యెడల అతని మనస్సాక్షి దాన్ని ఆమోదించును. ఉదాహరణకు, విశ్వాసమొక్కటి మాత్రము రక్షించునని ఒకడు మొదటినుండీ బోధింపబడిన యెడల, ఆ బోధ విషయమై అతడు మంచి మనస్సాక్షి కలిగియుండును. మిగతా విషయాలన్నిటిలోను యిట్లే యుండును. ఇంకోమాటలో ఒకడు యేమి బోధింపబడ్డాడో, యేమి నమ్ముచున్నాడో దానిని బట్టి అతని మనస్సాక్షి ఆమోదించుటగాని, తిరస్కరించుట గాని చేయును.

లేఖనముల ప్రకారము ఒకడు మంచి మనస్సాక్షి గలవాడై యుండాలంటే అతని మనస్సాక్షి దేవుని వాక్యము నెరిగినదై యుండాలి. దేవుని వాక్యము నెరుగని మనస్సాక్షి ప్రకారము ఒకడు ప్రవర్తిస్తే అతని మనస్సాక్షి అతని పెడత్రోవను పట్టించును.

ఉదాహరణకు పేతురు ఇట్లు చెప్పాడు : "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది; అదేదనగా శరీర మాలిన్యము తీసివేయుట కాదుగాని యేసు క్రీస్తు పునరుత్థానమూలముగా దేవుని విషయము నిర్మలమైన మనస్సాక్షినిచ్చు ప్రత్యుత్తరమే" (I పేతురు 3 : 21). ఒకడు బాప్తిస్మము పొందునపుడు అతడు యేసు ప్రభువునందు విశ్వాసముంచి, పాపముల [illegible]యమై

మారు మనస్సు పొంది, యేసే దేవుని కుమారుడని ఒప్పుకొనును. అయితే బాప్తిస్మము శరీరమాలిన్యమును పోగొట్టుకొనుటకు చేసే స్నానము కాదు. సరిగదా దేవుని యెడల మంచి మనస్సాక్షి కలిగి యుండుటకు అది సహాయము చేయును. దేవుడేమి కోరుచున్నాడో ఒకనికి తెలిసి యుండిన యెడల, దాన్ని అతడు చేయకుండా మంచి మన స్సాక్షి ఎట్లు కలిగి యుండగలడు?

ఇంకో మాటలో దొంగిలించుట, అబద్ధములాడుట వగయిరాలు తప్పు అని బోధింపబడినను, ఒకడు అవే పనులను చేయుటకుపకరించిన యెడల, అతనికి బోధింపబడిన దానికి వ్యతిరేకముగా చేయుచున్నాడు; అతని మనస్సాక్షికి భిన్నముగా ప్రవర్తించుచున్నాడు. తత్ఫలితముగా అతడు దోషియని మనస్సాక్షి వలన ఖండింపబడుచుయుండును. ఈ విధముగా దుష్ప్రవర్తనకు వ్యతిరేకముగా ఒకని మనస్సాక్షి పనిచేయును, మరియు సత్క్రియలు చేయుటకు అతనికి సహకరించును.

అయితే ఆత్మీయ విషయాల్లో ఒకని మనస్సాక్షి దేవుని వాక్య జ్ఞానము చొప్పున నడిపింపబడుచున్నప్పుడు అతని మనస్సాక్షికి లోబడవచ్చును. అట్టి జ్ఞానములేకుండా అతని మనస్సాక్షి ఆమోదించినను అది అతని పెడద్రోవను పట్టించును. గనుక నీవు మోసపడకుండా జాగ్రత్తపడుము. దేవుడు నీవేమిచేయాలని కోరుచున్నారో తెలిసికొను నిమిత్తము బైబిలును చదువుము. అది చెప్పు దానిని చేయుము. నీవు మంచి మనస్సాక్షి గలవాడవగుదువు!!

## మాదిరి ప్రార్థన

## (An Example Prayer)

మత్తయి 6 : 9 - 13

నీవు ప్రార్థన చేయునపుడు అనుసరించవలసిన నిర్దిష్టమైన విధానము లేక పద్ధతి ఏమియు లేదు. ప్రార్థన చేయుట అనగా నీ అనుభూతులు, నీ

అవసరతలు, నీకృతజ్ఞతలు, ఇతరుల ఎడల నీకు గల కోరికలు దేవునితో చెప్పుకొనుట. వాక్య నిర్మాణము లేదా అందువాడిన పదజాలము ఏవిధముగా అమర్చబడినది అనునది ముఖ్యముకాదు కాని దేవునితో మామూలుగా మాట్లాడుట. దేవుడు దానిని విని అవగాహన చేసుకొంటాడు.

అయితే బహిరంగ ప్రార్థన చేయునపుడు అట్టి వాక్య నిర్మాణము, పదజాలముల వాడుక అవసరమై యున్నది. ఎందుకనగా ఆలాగు చేయుట వల్ల అక్కడయున్న సంఘమంతయు అర్థము చేసుకొందురు. లేకపోయినట్లయిన వారందరు ప్రార్థనలో ఏకీభవించలేరు కాని నీవు ఒంటరిగా ప్రార్థించునపుడు దేవుడు నిన్ను, నీ ప్రార్థనను అవగాహన చేసి కొనగలడు.

మత్తయి 6 : 9 - 13 లో యేసుక్రీస్తు మాదిరి ప్రార్థనను చెప్పారు. కొన్ని సార్లు దీనిని " ప్రభువు ప్రార్దన" అని పిలుస్తారు కాని ఇది తనంత తానుగా చేసిన ప్రార్దన కాదు. ఎందుచేతననగా దీనిలో పాపముల కొరకు క్షమాపణ కోరినట్లుగా వ్రాయబడెను. యేసు ఎన్నడును తన స్వంత పాపముల కొరకు క్షమాపణ కోరలేదు ఎందుకనగా ఆయన ఎన్నడును పాపము చేయలేదు.

ఇది క్రైస్తవులు అలవాటు ప్రకారముగా మరల మరల ఉచ్చరించదగిన ప్రార్థన కాదు. ఈ ప్రార్దనను క్రొత్త నిబంధన సంఘము ఎన్నడును వాడి యుండలేదు. అయినప్పటికి ఇది మానవులు ఏలాగు ప్రార్థించవలెనో అని బోధించుటకు యేసుచే ఇయ్యబడిన మాదిరి ప్రార్దన.

యేసు ఈ మాదిరి ప్రార్దన ఇచ్చునప్పటికి రాజ్యము ఇంకను స్థాపించబడలేదు. ఆ సమయములో "నీరాజ్యము వచ్చుగాక" అని ప్రార్థించుట సరియైన విధానమే కాని ఇపుడు రాజ్యము (సంఘము) వచ్చియున్నది. కనుక రాజ్యము యొక్క రాక కొరకు ప్రార్థించ వలసిన అవసరము లేదు.

మాదిరి ప్రార్ధనలో గల ఒక్కొక్క భాగము మనకు ఎంతవరకు సంబంధించినది చర్చించుదుము.

1. పరలోక మందున్న మా తండ్రీ : అనగా మనము చేయు ప్రార్ధనలు తండ్రియైన దేవుని నుద్దేశించి చేయాలి.

2. నీనామము పరిశుద్ధ పర్చబడును గాక : అనగా దేవుని యొక్క నామము పరిశుద్ధమైనది. ఈ మాట దేవుని ఔన్నత్యాన్ని తెలియజేయుచున్నది, అనగా ఆయన యొక్కగొప్పదనాన్ని మనము ఎల్లప్పుడు గుర్తించాలి.

3. నీ రాజ్యము వచ్చును గాక : రాజ్యము ఇప్పటికే వచ్చియున్నది కనుక ఇది రాజ్యము అనగా సంఘమును గూర్చిన భాధ్యతను గూర్చి తెలియ జేయుచున్నది. అనగా సంఘ అభివృద్ధికొరకు మనము ప్రార్ధించాలి. అపుడు రాజ్యము అభివృద్ధిచెందును.

4. నీ చిత్తము పరలోక మందు నెరవేరుచున్నట్లు భూమి మీదను నెరవేరునుగాక : మన విన్నపములు ఎల్లప్పుడు దేవుని చిత్తాను సారముగా ఉండాలి. మన చిత్తము కాదుగాని దేవుని చిత్తము నెరవేరాలని మనము ప్రార్ధించాలి (లూకా 22:42), దేవుని చిత్తానికి (ఆయన చట్టానికి) విధేయులమై యుండాలని ఇది సూచించుచున్నది. దేవుని చిత్తమునకు అనగా సువార్తకు ప్రజలు విధేయత చూపులాగున ప్రార్ధించాలి.

5. మా అనుదిన ఆహారమును నేడు మాకు దయచేయుము : దినదిన జీవితములో మనకు గల అవసరతలను గూర్చి ఇది తెలియ జేయుచున్నది. మన అవసరతల కొరకు దేవునిపై ఆధారపడి యుండాలని మనము తెలిసికొనవలెనని ఇది సూచించుచున్నది. మనకు ఏమి అవసరములున్నను మనము దేవుని అడగాలి.

6. మాఋణస్తులను మేము క్షమించిన ప్రకారము మా ఋణములను క్షమించుము :- ఋణము అనునది మనము చేసిన పాపములను సూచించుచున్నది. లూకా 11:4లో ఋణము అను మాటకు బదులుగా పాపము అని వాడబడినది. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుట ద్వారా మనము పూర్వమందు చేసిన పాపములకు విడుదలపొంది యున్నాము. ఒకవేళ ఇకను ఏమైన పాపములు చేసిన ఎడల దేవుని సన్నిధిలో ఒప్పుకొనుట వలన క్షమాపణ పొందుతాము (I యోహాను 1:9). దేవుడు మన యెడల ఏలాగుండాలి అని మనము కోరుకుంటామో మనము కూడా ఇతరుల ఎడల ఆలాగున ప్రవర్తించుట మన కర్తవ్యమై యున్నది. అనగా ఇతరులను క్షమించాలి అని మనము గుర్తించాలి.

7. మేము శోధనలో పడనీయక కీడునుండి తప్పించుము :- దేవుడు మనలను శోధించడు. ఆయన శోధిస్తాడు అని ఈ భాగము చెప్పుట లేదుగాని శోధనలో పడకుండా కాపాడు మని లేక బలపరచుమని ప్రార్థించాలి. ఇహలోక సంబంధమైన కోరికలు లేక శోధనలు కలిగినపుడు వాటినుండి రక్షణ కల్పించుమని మనము ప్రార్థించాలి.

8. ఎందుకంటే రాజ్యము, శక్తి, మహిమ నిరంతరము నీవైయున్నావు :- ఇది దేవుని మహిమ పరచుటను సూచించుచున్నది. మన ప్రార్థన అంతయుకూడా దేవుని గొప్పతనాన్ని మంచితనాన్ని ఘనపరిచేదిగా యుండాలి.

9. ఆమేన్ :- ఆమేన్ అనునది అంగీకారాన్ని తెలియజేయుచున్నది. ఆమేన్ అనగా ఆలాగుజరుగునుగాక అని అర్థము. అనగా ప్రార్థనలో చివరిగా ఇవే నాయొక్క అనుభవాలు మరియు విన్నపములు (కోరికలు) అని తెలియజేయుట.

క్రీస్తు నామమున ప్రార్ధన చేయవలెనని ఎవరును బోధింపక పూర్వము ఈ మాదిరి ప్రార్ధన ఇయ్యబడెనని గమనించవలెను. యోహాను 16:23,24 చదివినట్లయిన మనము మన ప్రార్ధన విన్నపములు ఆయన నామమున చేయవలెనని తెలియుచున్నది (కొలస్సీ 3:17).

కొన్ని కంఠస్థపదాలను మాత్రమే వాడుతూ ప్రార్ధన చేయరాదు. నీమనస్సులో గల మాటలను ఉపయోగించి ప్రార్ధన చేయాలి. దేవుని ఎడల భయభక్తులతో ఆయనతో మాట్లాడాలి. అదేసమయములో నీ ప్రాణ స్నేహితులతో మాట్లాడినట్టుగా దేవునితో నిష్కపటముగా మాట్లాడాలి. ఈ మాదిరి ప్రార్ధన నీ స్వంత ప్రార్ధన చేయుటకు సహాయముచేయునుగాక !

- డేవిడ్ ఫార్

కొండమీద ప్రసంగము - 22

# ప్రార్థన సూత్రములు

## (PRINCIPLES OF PRAYER)

### (మత్తయి 6:5 - 8)

యేసు ప్రభువు రహస్యమున ధర్మము చేయుటను గూర్చి బోధించిన తరువాత దేవునికి అంగీకార యోగ్యమైన ప్రార్థన విధానమును గూర్చి యిట్లు బోధించారు. "మరియు మీరు ప్రార్థన చేయునప్పుడు వేషధారుల వలె ఉండవద్దు; మనుష్యులకు కనబడవలెనని సమాజ మందిరములలోను వీధుల మూలలలోను నిలిచి, ప్రార్థన చేయుట వారి కిష్టము; వారు తమ ఫలము పొందియున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. నీవు ప్రార్థన

చేయునప్పుడు నీగదిలోనికి వెళ్లి తలుపువేసి రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్థన చేయుము, అప్పుడు రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును. మరియు మీరు ప్రార్థన చేయునప్పుడు అన్యజనుల వలె మాటలు వంచింపవద్దు. విస్తరించి మాటలాడుట వలన తమ మనవి వినబడునని వారు తలంచు చున్నారు. మీరు వారివలె ఉండకుడి. మీరు మీ తండ్రిని అడుగకమునుపే మీకు అక్కరగా నున్నవేవో ఆయనకు తెలియును'' (మత్తయి 6: 5 - 8).

అనేక పనులభారము వలన మనం ఈ రోజులలో ప్రార్థన చేయవలసినంత ఎక్కువగా ప్రార్థన చేయలేక పోవుచున్నాము. అయితే మన ప్రభువైన యేసు క్రీస్తు తరచు ప్రార్థించేవారు. ఒక్కోసారి ఆయన రాత్రంతా ప్రార్థించారు. ఆయన 12 మంది అపొస్తలులను ఏర్పరచు కొనకముందు రాత్రంతా ప్రార్థించారు (లూకా 6 : 12). చనిపోయిన లాజరును బ్రతికించక ముందు ఆయన ప్రార్థించారు (యోహాను 11:41,42). ఆయన అప్పగింపబడక ముందు గెత్సెమనె వనములో బహుదుఃఖముతో, వేదనతో ప్రార్థించారు (మత్త 26:36-46). ఆయన సిలువ మీద తన ప్రాణమునర్పించినప్పుడు కూడ రెండు మారులు ప్రార్థించారు (లూకా 23:34, 46).

మన ప్రభువు ప్రార్థన పరులే కాకుండ తన శిష్యులు కూడ ప్రార్థించాలని ఆయన చెప్పారు. అంతేకాకుండా తన శిష్యుల ప్రార్థన ఎట్లుండాలో, ఎట్లుండకూడదో కూడ ఆయనవారికి నేర్పారు. మనం ఇంతకుముందు చదివిన లేఖన భాగంలో ఆయన కొన్ని ప్రార్థన సూత్రములను బోధించారు. వాటిని ఇప్పుడు పరిశీలింతము :

# నిష్కాపట్యం

## (Sincerity)

మొదటిగా మన ప్రార్థన యదార్థవంతముగను, నిష్కపటముగాను యుండాలని ఆయన బోధించారు. "మీరు ప్రార్థన చేయునప్పుడు వేషధారుల వలె ఉండవద్దు" అని ఆయన చెప్పారు. అంతకుముందు ధర్మము చేయడాన్ని గూర్చిచెబుతు "నీవు ధర్మము చేయునప్పుడు మనుష్యుల వలన ఘనత నొందవలెనని వేషధారులు సమాజ మందిరములలోను, వీధులలోను చేయులాగున నీముందర బూర ఊదింపవద్దు" అని ఆయన చెప్పారు (మత్తయి 6:2). అట్లే ప్రార్థన చేయునప్పుడు కూడ మనుష్యులకు కనబడవలెనని, వినబడవలెనని మనం ప్రార్థించరాదు. మనం అట్లు చేస్తే మన అహంకారాన్ని వేషధారణను ప్రదర్శించుచున్నట్లే యగును. దానిని దేవుడు అసహ్యించుకొంటాడు (యాకోబు 4:6). మనం ప్రార్థన చేయనప్పుడు వినయ విధేయత కలిగి ప్రార్థించాలి.

శాస్త్రులు, పరిసయ్యులు మనుష్యులకు కనబడవలెనని సమాజ మందిరములలోను, వీధుల మూలలలోను నిలిచి ప్రార్థన చేసేవారు. అది వారి కిష్టము. వారు తమ ఫలమును పొంది యున్నారని ప్రభువు చెప్పారు. స్వనీతి పరులను ఖండించుచు యేసు ప్రభువు ఒక ఉపమానము చెప్పారు. ప్రార్థన చేయుటకై పరిసయ్యుడొకడు, సుంకరి ఇంకొకడు దేవాలయమునకు వెళ్లిరి. పరిసయ్యుడు "దేవా నేను చోరులును, అన్యాయస్థులును, వ్యభిచారులునైన యితర మనుష్యులవలెనైనను, ఈ సుంకరివలెనుండనందుకు నీకు స్తుతులు చెల్లించుచున్నాను. వారమునకు రెండు మారులు ఉపవాసము చేయుచు, నాసంపాదన అంతటిలో పదియవ వంతు చెల్లించుచున్నాని తనలో తాను ప్రార్థించుచుండెను. అయితే సుంకరి దూరముగా నిలుచుండి, ఆకాశమువైపు

న్ను లెత్తుటకైనను ధైర్యము చాలక రొమ్ము కొట్టుకొనుచు - దేవా పాపినైన నన్ను కరుణింపుము అని పలికెను. అతని కంటెయితడు నీతిమంతునిగా తీర్చబడి తన యింటికి వెళ్లెనని" మన ప్రభువు చెప్పెను (లూకా 18:9 - 14).

మనం ప్రార్థన చేయునప్పుడు నిష్కల్మషంగా, యదార్థ హృదయంతో దేవునికి ప్రార్థించాలి. పరిసయ్యునివలె మనుష్యులకు కనబడాలని చేసే ప్రార్థన యొక్క ఫలితం శూన్యం.

## ఏకాంతం

### Solitude

అయితే ఈ నిష్కపట తత్వం, యదార్థత మనకు ఎట్లు వస్తాది? "నీవు ప్రార్థన చేయు నప్పుడు నీగదిలోనికి వెళ్లి తలుపు వేసి రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్థన చేయుము" అని ప్రభువు చెప్పారు. మనలో నిష్కాపట్యం కనబడాలంటే మనం రహస్య ప్రార్థన లేక ఏకాంత ప్రార్థన చేయాలి. ప్రార్థన చేయడానికి గదిలోనికి వెళ్లినప్పుడు నీవు, నీతండ్రియైన దేవుడు తప్పమరి యెవరు ఉండరు. ఆయన రహస్యమందు చూచు తండ్రి, గనుక నీ ప్రార్థనకు జవాబిచ్చును. ఆయన నీ బాహ్యవేషాన్ని కాదు గాని నీ హృదయమును పరిశోధించువాడు. ప్రార్థన చేయుటలో నీ రహస్య తలంపులను, ఉద్దేశ్యములను ఎరిగిన వాడు (1 సమూ 16:7).

రహస్యమందు ప్రార్థించాలని అన్నప్పుడు బహిరంగ ప్రార్థనలు చేయరాదని యేసు ప్రభువు యొక్క ఉద్దేశ్యము కాదు. బహిరంగ ప్రార్థనను క్రొత్త నిబంధన ప్రోత్సహించుచున్నది. ప్రతి స్థలమందును పురుషులు పవిత్రమైన చేతులెత్తి ప్రార్థించాలని పౌలు చెప్పాడు (1 తిమో 2:8). భక్తుడైన యాకోబు కూడ బహిరంగ ప్రార్థన చేయుటను ప్రోత్సహించాడు (యాకోబు 5:16). అయితే

మన వ్యక్తిగత ప్రార్థనల విషయంలో మనం ఏకాంతముగా యున్నప్పుడు దేవునితో మన హృదయాన్నంతా విప్పి చెప్పవచ్చును. మన జీవితంలోని సమస్తాన్ని ఆయన ఎరిగిన వాడు గనుక ఆయనపై మనం సంపూర్తిగ ఆధారపడవచ్చును. యేసు ప్రభువు కూడ ఏకాంతముగా ప్రార్థనలో గడిపేవారు (మత్త 14 : 23).

## సూక్ష్మం

### Simplicity

తరువాత మన ప్రార్థనలు సూక్ష్మంగా, **Simple** గా యుండాలని ప్రభువు బోధించారు. "మీరు ప్రార్థన చేయునప్పుడు అన్యజనుల వలె వ్యర్థమైన మాటలు వచింపవద్దు. విస్తరించి మాటలాడుట వలన తమ మనవి వినబడునని వారు తలంచుచున్నారు. మీరు వారివలె ఉండకుడి" (మత్త 6:7).

హృదయమునిండి యుండు దానిని బట్టి నోరు మాటలాడునని ప్రభువు బోధించారు (మత్త 12 : 34). మనం ప్రార్థన చేయునప్పుడు అనవసరంగా, విస్తార మైన మాటలు పలుక నవుసరం లేదు. దేవుడు అతి సూక్ష్మమైన ప్రార్థనలను కూడ వింటాడు. పేతురు నీటిలో మునిగి పోసాగగా "ప్రభువా, నన్ను రక్షింపుమని" ప్రార్థించాడు (మత్తయి 14 : 30). "దేవా పాపినైన నన్ను కరుణింపుము " అని సుంకరి ప్రార్థించాడు. యేసు ప్రభువుతో కూడ సిలువ వేయబడిన నేరస్తులలో ఒకడు "యేసూ నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమని" ప్రార్థించాడు (లూకా 23:42). "యేసు ప్రభువు సిలువ మీద వ్రేలాడుచు, "తండ్రీ నీ చేతికి నా ఆత్మను అప్పగించు కొనుచున్నానని" చెప్పి ప్రాణము విడిచెను (లూకా 23 : 46).

మన హృదయములు కలత జెందునప్పుడు, దేవుని పై మనం ఎక్కువ ఆధారపడి యున్నప్పుడు, మనం ఆపదలలో యున్నప్పుడు అలంకార భాషను మనం ప్రయోగించము గాని, అతి సుళువుగా, సాధ్యమైనంత క్లుప్తముగా మన హృదయ వేదనను దేవునికి తెలియజేసికొంటాము. అట్లుగాక మన చుట్టు యున్నవారిని గమనిస్తు ప్రార్థన చేసినప్పుడు వ్యర్థమైన మాటలు వచించే ప్రమాదమున్నది. ఆయన ప్రతి మనుష్యుని యొక్క హృదయమును ఎరిగినవాడు. గనుక యెవరి ప్రవర్తనను బట్టి వారికి ఆయన ప్రతిఫల మిచ్చును (1 రాజులు 8 : 39).

## భద్రత

## Security

తరువాత మనం ప్రార్థన చేయునప్పుడు తండ్రి యైన దేవుని నుండి మనకు కలిగే భద్రతను ( **Security** ) ఎరిగిన వారమై ప్రార్థించాలని యేసు ప్రభువు బోధించారు. "మీరు మీ తండ్రిని అడుగకమునుపే మీకు అక్కరగా సున్నవేవో ఆయనకు తెలియును". మన ప్రార్థనలు యదార్థ హృదయంతోను, ఏకాంతముగాను, సూక్ష్మముగాను యుండుట మాత్రమే గాక దేవుడు మన తండ్రియని, ఆయన మన ప్రార్థనలనాలకించి ప్రత్యుత్తర మిస్తాడనే నమ్మకముతో ప్రార్థించాలి. విస్తరించి మాటలాడుటవలన తమ మనవి వినబడునని అన్యజనులు తలంచేవారు. అయితే దేవుని బిడ్డ యొక్క ప్రార్థనను దేవుడు వింటాడు. ఏలయనగా ఆయన అతని తండ్రి మరియు, ఆయన అతని అక్కరలను ఎరిగినవాడు.

మనము అడుగువాటన్నిటి కంటెను, ఊహించువాటన్నిటి కంటెను అత్యధికముగా చేయుశక్తి గలవాడు మనదేవుడని అపో. పౌలు చెప్పాడు (ఎఫెసీ

3 : 21). ఆయన మన అవసరాలను ఎరిగిన వాడే అయినను, మనం అడగాలని ఆయన చెప్పారు. అందువలన మనుష్యులు విసుగక నిత్యము ప్రార్థన చేయాలి (లూకా 18 : 1) మరియు ఎడతెగక ప్రార్థన చేయాలి (1 థెస్స 5 : 17). మనము సమయోచితమైన సహాయము కొరకు కృపపొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు ప్రార్థన ద్వారా చేరాలి (హెబ్రీ 4 : 16).

మనము ప్రార్థన చేయుటకు సంకల్పించాలి. దానియేలు వలె, గా...ము వలె ప్రార్థించుటకు మనం సమయాన్ని కేటాయించాలి (కీర్త 55 : 17). మనం ప్రత్యేకంగా ప్రార్థించాలి, తరచు ప్రార్థించాలి, దేవుని బిడ్డలవ... మనం క్రమముగా, ప్రత్యేకముగా, ఎడతెగక ప్రార్థించితే, మన ప్రార్థనల... ఆయన జవాబిస్తాడనే ధైర్యముతో ప్రార్థించగలము. మనం ఆయన చిత్త ...ారము ప్రార్థించిన యెడల మన ప్రార్థనలకు ఆయన తప్పక జవాబిచ్చును.

- జాషువా గూటం

# దేవుని సర్వశక్తి

## (The Omnipotence of God)

దేవుని సర్వశక్తి బ్రహ్మాండమైనది. పరమాణు బాంబు వలన ఉద్భవించిన శక్తి ఊహా తీత మైనదని లేదా అంతరిక్ష నౌకను రోదసీలోనికి కొనిపోయే శక్తి గంభీరమైనదని. నీవను కొనుచున్న యెడల దేవుని శక్తి నీకు సమస్యగానే యుండును. అది సమస్య అయినను కాకపోయినను దేవుని గూర్చి సరియైన అవగాహన కలిగి యుండుటకు ఆయన యెదుట వినయము కలిగి యుండుటకు దానిని గూర్చి మనం తెలిసికోవాలి.

### సర్వశక్తి అంటే ఏమిటి ?

సర్వశక్తి (Omnipotence) అనే పదం మూలభాషయైన లాటిన్‌లో "సర్వశక్తి మంతుడు" అనే భావాన్ని కలిగియున్నది. అది సాధారణంగా దేవునికి

మాత్రమే వాడబడే పదం. ఆయన ఒక్కడే సర్వశక్తిమంతుడు లేదా అమిత శక్తిమంతుడు. "దేవుడు అబ్రహాముతో ఇట్లన్నాడు: 'నేను సర్వశక్తిగల దేవుడను. నా సన్నిధిలో నడుచుచు నిందా రహితుడవై యుండుము "(ఆది 17:1). " నీవు సమస్త క్రియలను చేయగలవనియు నీవు ఉద్దేశించినది ఏదియు నిష్ఫలము కానేరదనియు నేనిప్పుడు తెలిసికొంటిని" అని దేవునితో యోబు అన్నాడు (యోబు 42:2). దేవునికి సమస్తమును సాధ్యమేయని యేసు చెప్పారు. ఇది బైబిలు అంతటిలో కనబడు బోధ; సృష్టికర్తయొక్క లక్షణాన్ని ప్రకృతి ప్రచురపరచుచు వర్ణించుచున్నది. ఈ విశ్వములో యున్నశక్తి అంతాదేవునికి చెందును. గనుక దేవుడు సర్వశక్తిమంతుడు. విజ్ఞాన శాస్త్రము ఎరిగినంత మట్టుకు పదార్థము చలనము జీవము లేనిది, మృతమైనది. అది చలించుచున్నట్లగుపడినను బాహ్యశక్తి వలన, అది చలింపజేయ బడుచున్నది. మానవునికున్న శక్తి ఏదయినను అదివేరే స్థానము నుండి పొందినది. గనుక వివిధములైన చలన శక్తిరేఖలు సర్వశక్తుని హస్తము నుండి ఉద్భవించినవే. సర్వశక్తి అనగా తాను ఇచ్ఛయించు కొనిన దాని నంతటిని కలుగజేయగల శక్తియని మరొక గ్రంథకర్త నిర్వచించాడు.

## ఋజువుపరచబడిన దేవుని శక్తి

శక్తిని ఆరోపించుకోవడం అసాధారణం కాదు. దేవతార్చకులు తమ దేవుండ్లకు ఏదేదో శక్తి ఉన్నదని ఆరోపించుకొనేవారు. "మా దేవుడు మీదేవుని ఓడించగలడు" అనే సూత్రంతో వారు యుద్ధము లాడేవారు. అయితే వారి దేవుండ్లు మాత్రము ఎన్నడు తమశక్తిని రుజువు పర్చలేదు. ఈ సత్యాన్ని గిద్యోను (న్యాయా 6:31), ఏలియా (1రాజులు 18), యెహూ (2 రాజులు 10) మొదలగువారు నిరూపించారు. అయితే సర్వశక్తుడైన దేవుడు తన సర్వశక్తిని నిరూపించారు ! దీనిని మనం రుజువు చేయగలం, చేస్తాం.

శూన్య సృష్టి (Exnihilio Creation) ద్వారా దేవుడు తన శక్తిని నిరూపించారు. అంటే ఆయన శూన్యము నుండి సృష్టిని కలుగజేసాడు. బుద్ధి పూర్వకముగా అంధులైన వారుతప్ప మిగిలిన వారితో ఎవడును కాదనలేనివిధంగా దానిని దేవుడు రుజువు పర్చాడు. "ఆది యందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" అనిమోషే వ్రాసినప్పుడు అతడొక గంభీర సత్యాన్ని క్లుప్తంగా రికిర్డుచేసాడు (ఆది 1:1). అది బ్రహ్మాండమైనది, ఏలయనగా అది ఆజ్ఞ పూర్వక సృష్టి. ఆయన ఆజ్ఞయిచ్చాడు. సృష్టి కలిగింది ! కీర్తన గ్రంధకర్త ఇట్లన్నాడు: " ఆయన మాట సెలవియ్యగా దాని ప్రకారమాయెను ఆయన ఆజ్ఞాపింపగానే కార్యము స్థిరపరచబడెను" (కీర్త 33:9). దాని విస్తీర్ణత కూడ అది బ్రహ్మాండమైనది. అనూహ్యమైన ఈ విశ్వము యొక్క విస్తీర్ణతను గూర్చి బేసిల్ ఓవర్టన్ ఇట్లు చెప్పారు: "మనము ఎక్కడయున్నామో ఖచ్చితంగా శాస్త్రజ్ఞులకు తెలియక పోయినను, పాలపుంత అనబడే నక్షత్రవీధి (Milky way Galaxy) లో మనమున్నాము.

పాలపుంత అనబడే నక్షత్రవీధి (Galaxy) ఒక్కటి మాత్రమే యుంటే, దేవుడు ఈ విశ్వాన్ని గూర్చి, నక్షత్రాలను గూర్చి చెప్పిన దానిని స్థిరపరచుటకు అది సరిపోతాది. పాలపుంత నక్షత్రవీధి యొక్క వ్యాసము లక్ష కాంతి సంవత్సరములును, దానిమందము 200 కాంతి సంవత్సరములును ఉన్నట్లు శాస్త్రజ్ఞులు చెప్పుదురు. దాని గంభీరతను ఊహించుకోవడానికి ప్రయత్నించు - వెలుగు సెకనుకు 186000 మైళ్లవేగము చొప్పున పయనించుచుండగా ఈ పాలపుంతను దాటుటకు ఒకలక్ష సంవత్సరములు పట్టును! మనమున్న నక్షత్రవీధి యొక్క విస్తీర్ణతను చూచునప్పుడు లక్ష కోట్ల నక్షత్రవీధులలో అది యొకటి మాత్రమే యనిగ్రహించే సరికి దేవుని యొక్క గంభీర శక్తినీ, ఈవిశ్వము యొక్క అనూహ్యమైన శక్తిని తెలిసికోగలవు. "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచుర పరచుచున్నది" యను మాట వాస్తవమే (కీర్త 19:1).

ఈ విశ్వము యొక్క విస్తీర్ణతనుండి మనము, భూమిని, దాని నివాసులను గమనిద్దాం. అట్లు చేయడంలో దేవుని శక్తిని తక్కువ చేయంగాని వక్కాణిస్తాము. ఈ విశ్వాన్ని సృష్టించిన దేవుడే సీతాకోకచిలుకను కూడ చేసాడు! ప్రకృతి యొక్క సౌందర్యాన్ని వర్ణిస్తూ మనం జీవితంలో మిగిలిన సంవత్సరాలన్నిటిని గడిపేయవచ్చు. మానవుని గూర్చి ఆలోచించు - ఆలోచించే, యోచించే, చలించే, క్రియ ప్రతిక్రియచేసే ప్రాణి అతడు. అందుకే దావీదువలె "నీవునన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి. అందును బట్టి నేను నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాను. నీ కార్యములు ఆశ్చర్యకరములు. ఆ సంగతి నాకు బాగుగా తెలిసి యున్నది" యనిచెప్పగలము (కీర్తన 139:14).

## అద్భుతశక్తి

అద్భుతములు చేయగలిగే శక్తిని బట్టి కూడదేవుని శక్తి రుజువు చేయుబడింది. ప్రకృతిని చేసినవాడే ప్రకృతిని ఆటంకపరచగలడు. ఎర్రసముద్రము రెండు పాయలుగా చేయబడుట (నిర్గ 14:21,22) సూర్యుడు నిలిచిపోవుట (యెహోషువ 3:16; 2 రాజులు 2:8) సూర్యుడు వెనుకకు తిరుగుట (2 రాజు 20:9-11) యొర్దానునది నీళ్ళు రెండు మారులు పాయలగుట (యెహో 3:6, 2 రాజులు 2:8) సింహములనోళ్ళు మూయించబడుట (దానియే 6:16-23) మొదలగు మహత్కార్యములలో తానుచేసిన సృష్టిని భంగపరచుటకు అదుపులో యుంచుటకు దేవునికి గలశక్తి నిరూపించబడుట మనము చూడగలము.

యేసునందు విశ్వాసము ఉద్భవించునట్లు ఈశక్తి యేసు ద్వారా యేసుచేత వినియోగించబడింది (యోహా 20:30,31). పెంతెకోస్తునాడు పేతురు యూదులతో ఇట్లన్నాడు: " ఇశ్రాయేలువారలారా యీ మాటలు వినుడి.

దేవుడు నజరేయుడగు యేసుచేత అద్భుతములను మహత్కార్యములను సూచక క్రియలను మీ మధ్యను చేయించి ఆయన వలన మెప్పుపొందిన వానిగా మీకు కనబరచెను; ఇది మీరే యెరుగుదురు" (అపొ. కా. 2:22). ఈ అద్భుతములు అన్ని రూపములలోను కనబడ్డాయి. అవి తుఫానును నిమ్మళించుటలో ప్రకృతిపై శక్తిని (మత్త 14:22-23) కుష్ఠరోగులను శద్ధిచేయుటలో రోగములపై శక్తిని (లూకా 17:11-19) గదరేనీయుల దేశములో ప్రయాణిస్తూ ఒకమనిష్యునిలో నుండి అపవిత్రాత్మలను వెళ్ళగొట్టుటలో దయ్యములపై శక్తిని (లూకా 8:26-39), కొంచెముతో అనేక మందికి ఆహారము పెట్టుటలో భౌతిక వస్తువులపై శక్తిని (మత్త 14:13-21) చనిపోయిన లాజరును బ్రదికించుటలో మరణముపై శక్తిని (యోహా 11:1-44) అద్భుతములు నిరూపించుచున్నవి. ఈ విషయంలో మనకు కష్టమేమీలేదు, "ఏలయనగా ఆకాశమందున్నవియు, భూమి యందున్నవియు, దృశ్యమైనవిగాని అదృశ్యమైనవిగాని అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను, ప్రధానులైనను, అధికారములైనను, సర్వము ఆయన యందు సృష్టింపబడెను. సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను" (కొల 1:16). సృజించినవాడు కంట్రోలు చేయగలడు. ఆయన అట్లు చేయుట సహజము..

## పునరుత్థాన శక్తి

దేవుని శక్తియొక్క రుజువులలో మరొక గొప్పరుజువు యేసుక్రీస్తు యొక్క పునరుత్థానములో యున్నది. పౌలువ్రాసిన పత్రికలను చదువు. వారు ఉన్నతమైన జ్ఞానము కలిగియుండునట్లు ప్రార్థించాడు. "ఆయన మిమ్మును పిలిచిన పిలుపు వలననైన నిరీక్షణ యెట్టిదో ఆయన పరిశుద్ధులలో ఆయన స్వాస్థ్యము యొక్క మహిమైశ్వర్యము ఎట్టిదో ఆయన క్రీస్తునందు

ప్రయోగపరిచిన బలాతిశయమును బట్టి, విశ్వసించు మనయందు ఆయన చూపుచున్న తనశక్తి యొక్క అపరిమితమైన మహాత్మ్య మెట్టిదో మీరు తెలిసికొనవలెనని..... నేనునా ప్రార్ధనల యందు మిమ్మును గూర్చి విజ్ఞాపన చేయుచున్నాను" అని అతడు చెప్పాడు (ఎఫెసీ 1:19,20). దేవుడెంత శక్తిమంతుడో తెలిసికొనాలంటే , పునరుత్థానమును వీక్షించుము ! అది కలకాదు, ఊహకాదు కల్పన కాదు గాని విపులంగా యున్న వాస్తవము. దేవుడు యేసును మృతులలో నుండి లేపాడు ! మనము మరమనుషులను యాంత్రిక మనుష్యులను నిర్మించవచ్చు. గాని మృతులను దేవుడు మాత్రమే లేపగలడు. అది సర్వశక్తుడైన దేవుని యొక్క ఆశ్చర్యకరమైన గంభీరమైన శక్తి యొక్క నిర్ధారణయే.

దేవుని సర్వశక్తినిగూర్చి కొన్ని వాస్తవాలను కూడమనము ఎరిగి యుండాలి. దేవుడు సర్వాధికారి యనెడి సత్యం "దేవునికి అసాధ్యమైనది ఏదైనా కలదా ?" అనే ప్రశ్నకు జవాబిచ్చుటకు నాకేమీ కష్టము కాదు (ఆది 18:14). "నీవు సమస్త క్రియలను చేయగలవని" యోబు చెప్పిన మాటతో సంపూర్ణముగా నేను ఏకీభవించుచున్నాను (యోబు 42:2). "దేవునికి సమస్తమును సాధ్యమే" యని యేసు చెప్పిన మాటను నేను హర్షించుచున్నాను (మార్కు 10:27). అదే సర్వశక్తి ! నేను ఊహించగలిగిన దానికంటే అత్యున్నతమైన శక్తిగల దేవుని నారాధించుచున్నాను. ఎంత ఆశ్చర్యకరమైన సత్యమో ! ఆసత్యముతో మిళితమై యున్నక్షేమము ఎంత గొప్పదో ! (సశేషం)

- జిమ్ ఓ కోనర్.

# అయ్యలారా, రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను?

# (Sirs, What must I do to be saved?)

(గత సంచిక తరువాయి)

మనము దేవుని సంకల్పము లేక పథకము వలన రక్షింపబడితిమే గాని యే ఒక్కదానిని బట్టి కాదు. ఉదాహరణకు గడియారము తీసికొందము. అది పరిపూర్ణమైన ఒక పద్ధతి (SYSTEM). సమయమును తెల్పుటయే దాని ఉద్దేశము. దాని యందలి ప్రతి విభాగము ప్రాముఖ్యమైనదే. ప్రతి విభాగము సమయమును సరిగా తెలియజేయుటకుపయోగపడును. పెద్ద స్ప్రింగు యెంత ప్రాముఖ్యమో సెకన్ల ముల్లు అంతే. చిన్న స్ప్రింగు యెంత ప్రాముఖ్యమో గంటల ముల్లును అంతే ముఖ్యము. ఈ పద్ధతి తెలియని వానికి కొన్ని విభాగములు అవుసరము లేనివిగా అగుపించవచ్చును. నిజానికి, అటువంటి వాని ముందు విడి విభాగములన్నియు వేసినట్లయితే, వాటన్నిటిని కూర్చి గడియారము చేయుటకు యెంతో శ్రమపడును.

ప్రజలను రక్షించుటయే రక్షణ సంకల్పము యొక్క ఉద్దేశ్యమైయున్నది. అది ఒక దైవిక నియమావళి, అది సంపూర్ణమైనది. దాని నుండి యేమియు తీసివేయవలదు. ఆ పథకము యింకను క్రియ చేయును. కృప యెంత ముఖ్యమో రక్తమును అంతే ; సువార్త ప్రకటన యెంత ఆవశ్యకమో మారు మనస్సు అంతే. బాప్తిస్మమెంత అవుసరమో విశ్వాసమును అంతే ; బాప్తిస్మము పొందుట ఎందుకు ఆవశ్యకమో యిహలోక జ్ఞానము గ్రహించుకొనలేకపోవచ్చును గాని దైవ జ్ఞానము గ్రహించెను. ఏలయనగా దేవుడు దానిని క్రమపరచి యుండెను. "దేవుని వెఱ్ఱితనము మనుష్యజ్ఞానము కంటె జ్ఞానము కలది" యని పౌలు చెప్పుచున్నాడు (I కొరింథీ 1 : 25).

గాలము వేసి చేపలు పట్టుకొనుటకు కఱ్ఱ, త్రాడు, ముల్లు ఎర వినియోగింతురు. ముల్లుతో చేపలు పట్టాను అని చెబితే అది నిజమే కాని సంపూర్ణ సత్యము కాదు. ఎందుకంటే కఱ్ఱ, త్రాడు కూడా ఉపయోగింపబడినవి. ముల్లు ఉపయోగింపబడినను, ఎరతో పట్టాను అంటే నిజమే.

గాలపు పద్ధతిలో ఏ భాగముతోనైనా చేపలు పట్టాను అని చెప్పినను ఒకే భాగముతో పట్టితిమని అర్థము కాదు. అన్ని భాగములు అవుసరమే. వాటిని గూర్చి ప్రత్యేకముగా చెప్పకున్నను అన్నియు ఉపయోగింపబడెను!!

అదే విధముగా మనము విశ్వాసము వలన రక్షింపబడితిమి యని చెప్పినప్పుడు (యోహాను 3 : 15, 16) అది సత్యమే. అయినను సంపూర్ణ సత్యము కాదు. ఏలయనగా మనము మారుమనస్సు వలన రక్షింపబడితిమని బైబిలు చెప్పుచున్నది. మారు మనస్సు గూర్చి చెప్పునప్పుడు ఒప్పుకోలు వలనని కూడా గ్రహించుకోవలెను; మారు మనస్సు వలన అన్నప్పుడు విశ్వాసము వలన కూడా అని గ్రహించుకోవలెను. యిట్లనే మిగిలినవన్నియు క్రమములోనికి వచ్చును. అందువలన, మనము కృప వలన రక్షింపబడితిమి అన్నప్పుడు, బాప్తిస్మము వలన రక్షింపబడితిమను భావము స్ఫురించును. ఏలయనగా కృప లేక విశ్వాసము గూర్చి తేటగా బోధింపబడినట్లు, బాప్తిస్మము కూడా రక్షణ సంకల్పములో ఒక భాగమే.

అట్లయితే యివన్నియు యెట్లు రక్షింపగలవు? దైవ సంకల్పములో ప్రతిదానికి దానిపనియున్నది. దేవుడు తన ఏర్పాటును అనుగ్రహించి మనలను రక్షించును. మన పాపములు క్షమించును. క్రీస్తు తన్ను తాను బలిగా అర్పించుకొనుట వలన మనలను రక్షించును. పరిశుద్ధాత్ముడు అపొస్తలుల ద్వారా రక్షణ సంకల్పమును బయల్పరచుట వలన మనలను రక్షించును. బయల్పాటు నిచ్చిన వానికి ప్రతినిధులై యుండి అపొస్తలులు మనలను

రక్షింతురు. సువార్తను అంగీకరించి విధేయులమవుట వలన మనలను మనము రక్షించుకొందుమురు. అట్లనే చేయమని యితరులను ప్రోత్సహించుట వలన వారిని రక్షింతుము.

దేవుడు రక్షణ పథకమునుయేర్పాటు చేయుటకు కృప, లేక కటాక్షమే కారణము. రక్తము యోగ్యమైన కారణము, సువార్త ఆ సంకల్పము యొక్క బయల్పాటు, దానిని తెలియజేయుటకు సువార్త సాధనము, విశ్వాసము మనలను సువార్తను అంగీకరింపజేయును, మారుమనస్సు పాపపు అభ్యాసము నుండి మనలను మళ్ళించును, ఒప్పుకోలు క్రీస్తుకు చేయు భక్తి పూర్వకమైన ప్రమాణము, విధేయతకు ఆఖరి మెట్టయిన బాప్తిస్మము వలన మనము క్రీస్తులోనికి వత్తుము; మనలను పరలోకమునకు సిద్ధపరచు దైవ లక్షణములే క్రైస్తవ క్రియలు! ఇది ఆశ్చర్యముగా లేదా?

పెంతెకోస్తు దినమునుండి ప్రజలను రక్షించుటకు దేవుడు నిర్ణయించిన మార్గమిదే. దేవుడు పక్షపాతి కాడు. (అపొ. 10 : 34). ఈ పథకములోని యే ఒక్క భాగమును వదిలిపెట్టినను దేవుని వాక్యమును తిరస్కరించినట్లే. పైగా రక్షణ వాగ్దానము నుండి నీకు నీవే వేరుచేసుకొన్నట్లగును. "దేవుని వాక్యమును గైకొను వారు ధన్యులు" (ప్రకటన 22 : 14, అపొ. 2 : 37 -42).

ఒకే ఒక మార్గమున్నట్లయితే, ఈ లోకపు వేర్వేరు మతములు చేయునదేమి? అని అడుగవచ్చును. గడియారములు (Watches) పెట్టుకొను వారిని పోలిన ఒక గడియారమునకు మరొకదానికి సమయములో వ్యత్యాస ముండును, గనుక ప్రమాణ సమయ సాధనమును బట్టి మనము సరిచేసుకొందుము. ప్రమాణమునకు సమానముగా లేనట్టయితే అవి తప్పే. అన్నియు ప్రమాణముతో సమ్మతించితే బేధమే లేదు. బైబిలు ఒక్కటే దైవ ప్రమాణము (Devine regulator.). మనము దానితో ఏకీభవించితే మనము

అంగీకరింపబడుదుము. మత సంబంధమైన ప్రజలందరు బైబిలు వలన మాత్రమే పరిపాలింపబడినట్లయితే, మనమందరము క్రీస్తు యేసు నందు ఏకమవుదుము.

ప్రియ చదువరీ, యిప్పుడు మనము క్రీస్తు వలనను, ఆయన అపొస్తలుల వలనను బోధింపబడిన దేవుని రక్షణ మార్గమును జాగ్రత్తగా పరీక్షించితిమి. ఒక పాపి రక్షింపబడవలెనంటే అతడు తన పూర్ణ హృదయముతో ప్రభువైన క్రీస్తు నందు విశ్వాసముంచి, గత పాపములన్నిటి విషయములో మారు మనస్సు నొంది, బహిరంగముగా మనుష్యుల యెదుట క్రీస్తును ఒప్పుకొని, పాప విముక్తికై ఆయన పరిశుద్ధ నామమున బాప్తిస్మము పొందవలెనని దేవుడు కోరుచున్నాడని మనము నేర్చుకొన్నాము. దేవుని వాక్యమందలి పై షరతులన్నిటిని సమ్మతించినప్పుడు, అతడు పూర్వపు పాపముల నుండి రక్షింపబడును. ప్రభువు అతనిని తన సంఘముతో కలుపును (అపొ. 2 : 47; రోమా 16 : 16).

— సమాప్తం—

- C.A. వీలర్

## సువార్తికులకు సందేశం

క్రీస్తు సంఘ సేవకులారా

క్రీస్తు తోడి యాజకులారా

కదలి రండి సువార్త ప్రకటించుదాం

కలిసి రండి సత్యాన్ని ప్రకటించుదాం

మతము కాదిది నిజము ముక్తి మార్గము
మన యేసుని మాటలలో పరమార్థము
మానవాళి సమస్త పాపములు క్షమింపను
మనుజావతారుడై మహిలో యేసు పుట్టెను
సర్వ సృష్టికీ వార్త ఏకమై చాటుదాం

పాపరహితుడు శ్రీ యేసునాధుడు
మృతిని గెల్చి లేచిన మృత్యుంజయుడు
మార్గము సత్యము జీవమాయెనే
మార్పునొంది తిరిగితే మీరు ధన్యులు
సర్వసృష్టికీ వార్త ఏకమై చాటుదాం

అసత్యమును సంహరించి-సత్యమునే ప్రకటించుదాం
భిన్నమైన బోధలను భగ్నము గవించుదాం
మానవకల్పిత పద్ధతులు వ్యర్థమని
మహాదేవుని చిత్తమే నిత్యము సత్యమని
సర్వ సృష్టికీ వార్త ఏకమై చాటుదాం

యేసునామమందే మనకు రక్షణ
యేసురక్త ప్రోక్షణలో కలుగును క్షమాపణ
నమ్మిబాప్తిస్మము పొందితే రక్షణ
నమ్మని వారికి నరక శిక్ష నిశ్చయం
సర్వసృష్టికీ వార్త ఏకమై చాటుదాం!

చేయుచున్నారు. ఉండేశ్వరపురంలోని క్రీస్తు సంఘము సువార్తికుల సదస్సు కొరకు మంచి ఏర్పాట్లు చేసి సువార్తికులను చక్కగా సత్కరించిరి.

"పూర్వ కాలమందు నానా సమయములలోను, నానా విధములుగాను మన పితరులతో మాట్లాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను" (హెబ్రీ 1: 1,2). పితరుల యుగంలో ఆయన కుటుంబ యజమానులతోను, మోషేయుగంలో ఇశ్రాయేలీయులతో మధ్యవర్తుల ద్వారాను, ఆయన మాటలాడెను. ఆయన ఇశ్రాయేలీయులతో ఒక నిబంధన చేసెను. క్రీస్తు యుగారంభములో తన కుమారుని ద్వారా ఆయన సర్వమానవాళితో మాటలాడెను. క్రీస్తు మాటలు లేక ఆయన బోధ పరిశుద్ధాత్మ ప్రేరణచే క్రొత్త నిబంధనగా గ్రంధస్థము చేయబడెను. మన జీవమునకును, భక్తికిని కావలసిన వాటినన్నిటియు క్రొత్త నిబంధన లెఖనములు తెలియ జేయుచున్నవి. అది సంపూర్ణమైన శ్రేష్టమైన నిబంధన. నూతనంగా నేడు దేవుడు బయలు పరచవలసిన సంగతులున్నాయని భావించేవారు బైబిలును అసంపూర్ణ గ్రంధముగా చేయుచున్నారు.

లిఖిత పూర్వకమైన తన వాక్యము ద్వారా దేవుడు నేడు మనతో మాట్లాడు చున్నాడు. పరిశుద్ధ లేఖనముల కంటే ఎక్కువగాని తక్కువ గాని మనం బోధించరాదు. ఇంకోమాటలో లేఖనములను అతిక్రమించరాదు (I కొరింధీ 4 : 6 ). దేవుని దర్శనము కలిగినదని, ఆయన నేడు నేరుగా మాట్లాడుచున్నాడని బోధించువారు లేఖనములనెరుగని అబద్ధ బోధకులు. ఇశ్రాయేలీయులు మోషేతో యిట్లనిరి : "నీవు మాతో మాటలాడుము, మేము విందుము. దేవుడు మాతో మాట్లాడిన యెడల మేము చనిపోవుదుము " (నిర్గమ 20 : 19). "సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వము గలవాడై యున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు, ఎవడును ఆయనను చూడనేరడు" (I తిమోతి 6 : 16). అందువలన "ఆయనను కన్నులారా చూడకయే విశ్వసించుచు... చెప్పనశక్యమును, మహిమా యుక్తము నైన సంతోషము గలవారై ఆనందించు చున్నారని" పేతురు క్రైస్తవులకుపదేశించాడు.

యేసు ప్రభువు "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి" యనే గొప్ప ఆజ్ఞను తన అపొస్తలుల కిచ్చిన నాటి నుండే రక్షణ సంకల్పమును మానవులకు మానవులే లేఖనముల నుండి అందియ్యాలి గాని, దేవదూతలు గాని, దర్శనములు గాని మరొక విధంగా గాని కాదు. ఐతియోపీయునికి సువార్త ప్రకటించుటకు ప్రభువు దూత ఫిలిప్పును పంపెను. దూత తానే వెళ్ళి స్వయంగా సువార్తను ప్రకటించలేదు. అపొస్తలుల కార్యములో మార్పు జెందిన వారి ప్రతి సందర్భములోను రక్షణ మార్గమును మానవులకు మానవులే ప్రకటించిరి. అది నేటికిని అట్లే యున్నది. దేవుని చిత్తాన్ని తెలిసికోవాలంటే నీవు లేఖనములను చదవాలి. వేరే విధంగా ఆయన నీతో మాటలాడడు.

మే నెల సువార్తికుల సదస్సు పశ్చిమ గోదావరి జిల్లా రావిక్రిందగ్రామములో (ఆచంట దగ్గర) 28వ తేదీ మంగళవారం జరుగును.

---

Regd. No. H/KD-45/KD H.O.
Date of Posting : 15th of Every month

From
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA - 533 001

To